క్లుప్తంగా

ఇస్కాన్‌లో రాధాష్టమి వేడుకలు రేపు


రాధాకృష్ణులు

కొమ్మాది : సాగర్‌నగర్ బీచ్ రోడ్డులో గల ఇస్కాన్ టెంపుల్‌లో శనివారం శ్రీ రాధాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా తెల్లవారు జామున 4.30 గంటలకు మంగళహారతి, 7 గంటలకు దర్శన హారతి, 9 గంటల నుండి హరినామ సంకీర్తన, 11 గంటల నుండి రాధారాణి ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రవచనాల కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు.

శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించేందుకు వస్త్రాలను, అభిషేక సామగ్రిని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణగా తీసుకు వెళ్లారు. అభిషేకాల అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

పొడుగుపాలెంలో ఇంటింటి కుళాయిలు ప్రారంభం


మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ చందక లక్ష్మి

ఆనందపురం: ఆనందపురం పంచాయతీ, పొడుగుపాలెం ఎస్సీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిలను సర్పంచ్ చందక లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఎస్సీ కాలనీవాసులు చాలాకాలం నుంచి తాగునీటికి ఇబ్బంది పడుతుండటంతో పంచాయతీ నిధులతో ప్రతీ ఇంటికీ కుళాయిలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నీటి సమస్య తీరడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు షిణగం పెద రామారావు, చిన రామారావు, దొంతల వెంకట నారాయణ, చందక అప్పలనాయుడు, చందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత


లబ్ధిదారులకు బీమా పరిహారం అందజేస్తున్న కోరాడ వెంకటరావు

ఆనందపురం : మండలంలోని వేములవలస సచివాలయం పరిధిలో గల పలువురికి శుక్రవారం వైఎస్సార్ బీమా పరిహారాన్ని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సర్పంచ్ లెంక కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి, కోరాడ రాంబాబు అందజేశారు. తిప్పల యశోదమ్మ అనే మహిళ మృతి చెందగా ఆమె కుమారుడు తిప్పల కమలాకర్‌రెడ్డికి తక్షణ సాయం కింద రూ.10 వేలు, 2022–2023 ఆర్థిక సంవత్సరంలో వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా పరిహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి నరసింగరావు, బీసీ కళ్లాలు సర్పంచ్ కోన పైడిరాజు, కన్వీనర్ కోరాడ మంగలత తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపైనే ఆటోల తిష్ట

- రోడ్డు మధ్యలో నిలిపివేస్తున్న డ్రైవర్లు
- ప్రైవేట్ మార్కెట్ వద్ద రాకపోకలకు అవస్థలు


ప్రైవేట్ మార్కెట్ వద్ద ప్రధాన రహదారిపై నిలిపివేసిన ఆటో, డివైడర్‌పై చిరు వ్యాపారాలు


ప్రయాణికుల కోసం రోడ్డుపై నిలిపి ఉంచిన ఆటో

తగరపువలస: స్థానిక ప్రైవేట్ మార్కెట్‌ను ఆనుకుని ప్రధాన రహదారిపై ఆటోలను డ్రైవర్లు ఇష్టానురాజ్యంగా నిలిపివేస్తున్నారు. అంబేడ్కరు కూడలిలో ప్రయాణికులను ఎక్కించుకున్న తరువాత నేరుగా వెళ్లిపోకుండా ఆటో నిండిన వరకు మార్కెట్ వద్ద నిలిపి వేస్తుండటంతో మిగిలిన వారికి ఇబ్బందికరంగా ఉంటోంది. రహదారి మధ్యలో ఆటోలను నిలిపి వేయడంతో ద్విచక్ర వాహనాలు మొదలుకుని భారీ వాహనాలు ముందుకు వెళ్లలేక వాటిని తీసేవరకు ఉండిపోవలసి వస్తోంది.

డివైడర్లపై చిరు వ్యాపారులు

మరోవైపు డివైడర్లను చిరు వ్యాపారులు ఆక్రమించుకోవడంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు, పాదచారులు ముందుకు వెళ్లలేకపోతున్నారు. ఇప్పటికే ప్రధాన రహదారిలో ఇరువైపులా సగభాగాన్ని వ్యాపారులు, తోపుడు బండ్ల వర్తకులు ఆక్రమించుకుని ఉన్నారు. ప్రైవేట్ మార్కెట్ లోపల సరిపడా స్థలం ఉన్నా వసతులు లేని కారణంగా వీరంతా రోడ్లపైనే ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 వరకు వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆదివారం అయితే నడిచేవారికి కూడా ప్రైవేట్ మార్కెట్ వద్ద రోడ్డుపై దారి లభించని పరిస్థితి నెలకొని ఉంది. భీమిలి ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సరిపడినంతగా లేకపోవడంతో మార్కెట్ వద్ద విధుల నిర్వహణ సాధ్యం కావడం లేదు. ప్రధాన రహదారిని ఆక్రమించుకుని వ్యాపారులు, ఆటోలు తిష్ట వేస్తున్నా జీవీఎంసీ విభాగం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అత్యవసర వాహనాలు వచ్చినా ఇదే పరిస్థితి

ప్రధాన రహదారి మీదుగా అత్యవసర వాహనాలు అయిన అంబులెన్స్‌లు, పోలీస్ వాహనాలు, అగ్నిమాపక శకటాలు వచ్చినా నిత్యం దారి దొరకని పరిస్థితి ఇక్కడ ఉంది. శాశ్వత పరిష్కారంగా వాహనాలు సాఫీగా సాగిపోవడానికి బంగ్లామెట్ట నుంచి తాతా థియేటర్ వరకు ప్రధాన రహదారిపై అడ్డంకులు లేకుండా చూడాలని భీమిలి పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పోటీలకు క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ బాలుర జట్లు


లోకేష్‌ను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ నరసింగరావు

భీమునిపట్నం : భీమిలి సెయింట్ ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు క్రీడలకు సంబంధించి నియోజకవర్గ స్థాయి బాలుర జట్ల ఎంపిక జరిగింది. ఇందు కోసం భీమిలి, ఆనందపురం, పద్మనాభం, విశాఖ రూరల్ మండలాల పాఠశాలలకు చెందిన అండర్ 14,17 సంవత్సరాల బాలురు 580 మంది పాల్గొనగా ఎంపికలను 56 మంది పీఈటీలు నిర్వహించారు. ఇందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ మొదలైన వాటికి సంబంధించిన నియోజకవర్గ జట్ల ఎంపికలు జరిగాయి. ఇక్కడ ఎంపికైన జట్లు త్వరలో జరగబోయే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. ఈ ఎంపిక కార్యక్రమం జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు కె.సతీష్ పర్యవేక్షణలో జరగ్గా, సెయింట్ ఆన్స్ కోఆర్డినేటర్ సిస్టర్ దీప, మరియాగ్రేస్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

తగరపువలస: జిల్లా స్థాయి అండర్–19 వాలీబాల్ పోటీలకు చిట్టివలస శ్రీకృష్ణ జూనియర్ కళాశాల విద్యార్థి దువ్వి లోకేష్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో శ్రీకృష్ణ విద్యాసంస్థల చైర్మన్ బి.నరసింగరావు, ప్రిన్సిపాల్ ఐ.రాజేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ తాతారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు


తాళ్లవలస జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తగరపువలస : భీమిలి మండలం తాళ్లవలస ఎంపీపీ, జెడ్పీ హైస్కూళ్లలో శుక్రవారం మోహిసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్, విశాఖ కంటి ఆస్పత్రి ట్రస్ట్, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 342 మంది విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఐదుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. త్వరలో వారికి అద్దాలు అందించనున్నామని సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోని జగ్గమ్మ, సన్నిబాబు, ప్రధానోపాధ్యాయులు ప్రభాకరరావు, అప్పారావు, కంటి ఆస్పత్రి వైద్యుడు సీహెచ్ వంశీకృష్ణ, హైస్కూల్ చైర్మన్ మన్యాల జ్యోతి, సత్యసాయి సేవా సంస్థల జోనల్ కో ఆర్డినేటర్ మానాపురం వెంకట సత్యసాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రఘురామ్


విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ చిరంజీవిరావు

ఆనందపురం : నిబంధనలు అతిక్రమించి ఆటోలు నడిపితే చర్యలు తీసుకుంటామని ఆనందపురం ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ తెలిపారు. మండలంలోని బోయిపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం తాగి ఆటో నడిపితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. ముందుసీట్లో ప్రయాణికులను కూర్చోబెట్టరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని, యూనిఫామ్ విధిగా ధరించాలని చెప్పారు. నిబంధనలను అతిక్రమించి నడిపితే, వాహనాలు ప్రమాదాలకు గురైతే కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

తగరపువలస: ట్రాఫిక్ నిబంధనలపై భీమిలి ఎస్ఐ చింతలపూడి చిరంజీవిరావు శుక్రవారం చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రధాన రహదారులు, కూడళ్లలో ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, వేగంగా వాహనం నడపడం, లైసెన్సు లేకుండా వాహనం నడపడం, ట్రిపుల్ రైడింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ గురించి వివరించారు. వీటి గురించి గ్రామాల్లో ప్రచారం చేసి అవగాహన కలిగించాలని కోరారు. కరస్పాండెంట్ అనుపమ జ్యోతిర్మయి, డైరెక్టర్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి వినతి


మంత్రి గోవర్ధనరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సూర్యనారాయణ. చిత్రంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి

తగరపువలస : భీమిలి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి అదనపు నిధులు మంజూరు చేయాలని ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ కోరారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని ఈ మేరకు ఆయన అభ్యర్థించారు. గురువారం అమరావతిలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సహకారంతో మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ భీమిలి మార్కెట్ యార్డులో రూ.87.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే రూ.50 లక్షలు మంజూరు చేయగా అదనంగా రూ.37.50 లక్షలు కోరినట్టు తెలిపారు. తగరపువలసలో రూ.72 లక్షలతో నిర్మిస్తున్న రైతుబజార్‌లో మరో 10 దుకాణాలు నిర్మించేందుకు రూ.10 లక్షలు కోరామన్నారు. ఆనందపురం మండలంలో రైతుబజార్ నిర్మాణానికి రూ.47.50 లక్షలు అవసరం అని తెలిపామన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్‌తో పాటు భీమిలి మండలం తాళ్లవలస వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి


అధికారులతో కలిసి పర్యటిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దేవస్థానం అధికారులను ఆదేశించారు.

సింహగిరిపై శుక్రవారం ఆయన దేవస్థానం ఇంజినీరింగ్ విభాగం, ఆలయ అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ముఖ్యంగా భక్తులకు మంచినీరు విరివిగా అందించే చర్యలు తీసుకోవాలని, పారిశుధ్యం మెరుగుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదం విభాగాన్ని పరిశీలించారు. సింహగిరికి వచ్చే ఏ ఒక్క భక్తుడు ఇబ్బందికి గురి కాకుండా చూడాలని, అశ్రద్ధ వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఈఈ రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు, ఏఈ హరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, పీఆర్వో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణపతి సన్నిధిలో అన్నదాన కార్యక్రమాలు


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు


కొండపేట పంప్‌హౌస్ రోడ్డులో గణపతి మండపం వద్ద అన్నదానం


పద్మనాభంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

కొమ్మాది : వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడలో మహాన్నదాన కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు ప్రారంభించారు. ముందుగా ఇక్కడ ఏర్పాటు చేసిన మండపం వద్ద గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లొడగల రామ్మోహన్, నొడగల రాంబాబు, మాదు చంటి తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస పరిసరాలలో..

తగరపువలస : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం చిట్టివలస గణేష్ థియేటర్ కూడలిలో, ఆదర్శనగర్ టీచర్స్ కాలనీలో, వేంకటేశ్వరమెట్ట స్వామి మెట్ల వద్ద, ఒకటో వార్డు రాజవీధిలో, కొండపేట గోస్తనీనది పంప్‌హౌస్ రహదారిలో భారీ అన్నసమారాధన కార్యక్రమాలు జరిగాయి. దొమ్మేటి లవరాజు తదితర పలువురు దాతల సాయంతో ఈ కార్యక్రమాలు జరిగాయి.

పద్మనాభంలో..

పద్మనాభం : వినాయక ఉత్సవాల్లో భాగంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద నిలిపిన వినాయక విగ్రహం వద్ద శుక్రవారం మూడు వేల మందికి అన్నదానం చేశారు. ఈ అన్నదానాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు ప్రారంభించారు. పద్మనాభంతో పాటు అర్చకునిపాలెం, ఇసకలపాలెం, కృష్ణాపురం గ్రామాలకు చెందిన భక్తులు ఈ అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న గణపతి విగ్రహాలు..

భీమునిపట్నం : భీమిలిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో బొమ్మలు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ భరత్ సెంటర్ బొక్కెదర మేడ వద్ద, బ్యాంక్ కాలనీ సమీపంలోని ఎల్లంపేట, ఎగువపేట పాంతాల్లో ఏర్పాటు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా ఉండగా వాటిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో..

మధురవాడ : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం జీవీఎంసీ 6, 7 వార్డుల్లోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. బక్కన్నపాలెం సాయిప్రియ రోడ్డులోని మాతృశ్రీ చారిటబుల్ ట్రస్ట్, శ్రీరామబుద్ధ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో సంస్థ ప్రతినిధి పోతిన వెంకటరామారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతిన శివ తదితరులు మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అలాగే ఆదిత్యనగర్‌లో భారీ అన్న సమారాధన జరిగింది. ఇక్కడ నాగోతి సూర్యప్రకాశరావు, పోతిన సాంబశివరావు, ఎల్ఎస్ నాయుడు, పోతిన ఉమా మహేశ్వరరావు, పితాని వెంకటేశ్వరరావు, కల్మటి తాతారావు తదితరులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అలాగే సంపత్‌నగర్, మధురవాడ తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు విశేషంగా జరిగాయి.

- జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం శ్రీ సాయి సూర్య రెసిడెన్సీలో ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు, అపార్ట్‌మెంట్ సెక్రటరీ ఎం. ధనుంజయరావు, పట్నాయిక్, కె. అప్పారావు, రేవళ్లపాలెం, మధురవాడ తదితర ప్రాంతాల మండపాల్లో మహిళలు కుంకుమ పూజలు చేశారు.

లక్ష్మీవానిపాలెంలో దీపారాధన

పీఎం పాలెం: వినాయక ఉత్సవాల్లో భాగంగా పీఎం పాలెం లక్ష్మీవానిపాలెంలో శుక్రవారం సాయంత్రం దీపారాధన కనులపండువగా జరిగింది. భక్తులు దీపాలు వెలిగించి, పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పోతిన ప్రజాదు, యల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

చిట్టివలసలో..

తగరపువలస: చిట్టివలస బాలికల వసతిగృహం వెనుక గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సూరిబాబు, జగదీశ్వరరావు, సాహు, తిరుపతి, స్వామి, వాసు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


బక్కన్నపాలెం సాయిప్రియ రోడ్డులో అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న పోతిన శివ తదితరులు

పర్యావరణ గణపతికి రెడ్ ఎఫ్ఎం లడ్డూ బహూకరణ..

తగరపువలస : స్థానిక పాత లోకల్ ఆఫీసు వీధిలో శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి యూత్ ఏర్పాటు చేసిన 13 అడుగుల మట్టి గణపతి విగ్రహం రేడియో రెడ్ ఎఫ్ఎం 93.5 వారిచే 25 కిలోల లడ్డూ గెలుచుకుంది. పర్యావరణహిత విగ్రహాలలో టాప్–9లో ఈ విగ్రహం నిలిచిందని రెడ్ ఎఫ్ఎం ప్రతినిధి భానుపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్న యువకులు కొల్లి రఘు, కుంచం సునీల్‌కుమార్, కుంచం సురేష్, తంగేటి సురేష్, తమ్మిన పవర్ మెహర్, బండారు ఎల్లాజీరావు, మాదాబత్తుల కిషోర్, కొల్లి మనోజ్, మాదాబత్తుల కుమార్‌లను అభినందించారు. వ్యాపారవేత్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొప్పల రమేష్, తమ్మిన రామలక్ష్మణ, మాదాబత్తుల గురునాథ్, దుర్గా రామకోటి, వానపల్లి కిషోర్, వజ్రేష్, పవిత్ర శ్రీను, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

- భీమిలి మండలం తాటితూరు సచివాలయం వద్ద దొర యూత్, తాళ్లవలస పంచాయతీ ఎరుసుపేటలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.

ఘనంగా కుంకుమ పూజలు..

మధురవాడ : మధురవాడలోని గణేష్ మండపాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. శివశక్తినగర్‌లోని లక్ష్మీ టవర్స్ అపార్ట్‌మెంట్‌తో పాటు గాయత్రి కళాశాల సమీపంలోని శ్రీ సూర్య రెసిడెన్సీ తదితర అపార్ట్‌మెంట్లలో కుంకుమ పూజలు నిర్వహించారు.



భీమిలిలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ఆనందపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన నాడే అందరూ ఆరోగ్యంగా ఉంటారని గొట్టిపల్లి సర్పంచ్ గంటా జగదీశ్వరరావు అన్నారు. గొట్టిపల్లిలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిసరాల్లో చెత్త పేరుకుంటే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం యూత్ ప్రెసిడెంట్ ఇల్లాపు వెంకటరావు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు. తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టైర్లు ఇంటి పరిసరాల్లో లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి సురేష్‌బాబు, హెచ్ఎం రుత్తల సన్యాసిరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ స్థలంలో పెట్రోల్ బంక్ సరికాదు


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు

మధురవాడ : సహకార వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డికే దక్కుతుందని పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు అన్నారు. శుక్రవారం మధురవాడ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే ఇక్కడ రూ. 20 లక్షలతో మధురవాడ పీఏసీఎస్ ఆవరణలో 2007లో షాపింగ్ సముదాయం నిర్మాణం జరిగిందని, సంస్థకు ఆదాయం సమకూర్చి పెడుతున్న ఆ నిర్మాణాన్ని కూల్చివేసి సుమారు 1100 గజాల స్థలంలో పెట్రోల్ బంక్ నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇది సరికాదన్నారు. ఇది సహకార వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అవుతుందని, ఈ చర్య రాజశేఖరరెడ్డి స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. గురువారం జిల్లా సహకార శాఖ, ఇతర అధికారులు ఇక్కడ స్థలం కొలతలు వేసిన విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. ఇక్కడ రైతులు, మహా జన సభ ఆమోదం లేకుండా ఈ రకమైన చర్యలు చేపట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అధికార యంత్రాంగం ఆ ఆలోచనను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కొల్లి మేఘారావు, పెంటపల్లి కాంతమ్మ, వి. సత్యనారాయణ, ఎండీ బేగం, జి. వేళంగిణీరావు, ఎంఎస్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు హిందీ దోహదం


గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనకు హిందీ భాష దోహదపడుతుందని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు అన్నారు. హిందీ దివస్ పక్షోత్సవాలలో భాగంగా భీమిలి ఝాన్సీ లక్ష్మీబాయి జీవీఎంసీ యూపీ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత హిందీ ప్రచార సభకు ముందుగా మహాత్మాగాంధీ అధ్యక్షునిగా ఉండి ప్రారంభించారన్నారు. హిందీ భాషా పక్షోత్సవాలను 1949 సెప్టెంబరులో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ప్రారంభించారన్నారు. ప్రతి ఏటా 14 నుంచి 29 వరకు ఈ పక్షోత్సవాలు దేశవ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.జయసుధ, ఉపాధ్యాయురాలు బి.ఎస్.గౌరి తదితరులు పాల్గొన్నారు.

వీధిలైటు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..


జెడ్పీ హైస్కూల్ రహదారిలో ఏర్పాటు చేసిన వీధి లైటు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ రహదారిలో శుక్రవారం వీధిదీపాలు ఏర్పాటు చేశారు. 'స్తంభాలున్నా...దీపాలు లేవు' శీర్షికన శుక్రవారం సాక్షిలో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.